నేటి దినపత్రిక
# సూర్య
కర్నూలు | నంద్యాల
శనివారం 16 డిసెంబర్ 2023 — పేజీలు 8


# అంగన్‌వాడీల అగచాట్లు..

- వైసీపీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయి..
- రెవెన్యూ కార్యాలయాలను ముట్టడించిన అంగన్‌వాడీలు.
- ఆస్పరిలో పోలీసులతో వాగ్వాదం చేసిన అంగన్‌వాడీలు..
- అంగన్ వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టిన అధికార దొంగలు..



అంగన్‌వాడీ సెంటర్ తాళాలు పగులగొడుతున్న అధికారులు

**ఆలూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అంగన్ వాడీల సమస్యలను తీరుస్తానని వారికి పనికి తగ్గ వేతనాలు ఇస్తానని పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పిన

మిగతా 2లో




తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

## ఫరూక్ - భూమా వర్గాలు
# కలిసేనా..



మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

- నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం
- భూమా, ఫరూక్‌లతో సమావేశానికి మాండ్ర ప్రయత్నాలు
- సమావేశం పై రంగంలోకి దిగిన జోనల్ ఇంఛార్జ్
- అవగాహన కుదరకుండా సమావేశమా అంటున్న భూమా వర్గం
- ఇప్పటికే పదవులకు రాజీనామా చేసిన భూమా వర్గం

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి మార్పు భూమా ఫరూక్ వర్గాల మధ్య చిచ్చును రాజేశాయి. భూమా వర్గం పార్టీ పదవులకు రాజీనామ చేసిన విషయం పాఠకులకు విధితమే. భూమా , ఫరూక్ వర్గాలు తూర్పు, పడమరలుగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం నంద్యాల అసెంబ్లీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఇన్‌చార్జి ఫరూక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం జరుగనుంది. ఇన్‌చార్జి మార్పు తర్వాత భూమా,ఫరూక్ వర్గాలు వర్గాలు ఇప్పటి వరకు కలవలేదు. సమావేశం ఏర్పాటు చేయడంతో భూమా వర్గం పెదవి విరుస్తుంది.ఇరువర్గాల మధ్య అవగాహన కుదరకుండా సమావేశం ఏర్పాటు చేయడం ఏమిటని భూమా వర్గం ప్రశ్నిస్తుంది. భూమా, ఫరూక్‌లతో సమావేశం ఏర్పాటు చేయడానికి నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి చొరవ తీసుకున్నట్లు తెలుస్తోంది. సమావేశం ఫరూక్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడంతో రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి రంగంలోకి దిగారు. ఇరువర్గాలతో మాట్లాడే ప్రయత్నాలను చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమావేశానికి భూమా వర్గం హాజరవుతుందా లేదా అన్నది అంతు చిక్కని ప్రశ్నగా కనిపిస్తుంది. సమావేశానికి జిల్లా అధ్యక్షులతోపాటు ముఖ్య నేతలు హాజరు కానున్నారు.ఒకే పార్టీలో

మిగతా 2లో



నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జిఎన్ఎండి. ఫరూక్

## విభజించి పాలిస్తున్న
# మోడీ ప్రభుత్వం




రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- అష్టకష్టాలు పడుతున్న రైతులు, కార్మికులు
- ఎఐకెఎస్ బహిరంగ సభలో వక్తల పిలుపు
- కర్నూలులో ఉత్తేజంగా రైతు ర్యాలీ

**కర్నూలు, మేజర్ న్యూస్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలను విభజించి పాలిస్తోందని, దీనివలన నష్టపోతున్నది, అష్టకష్టాలు పడుతున్నది కార్మికులు, కర్షకులేనని, మోడీ ప్రభుత్వాన్ని దించాల్సిన ఆవశ్యకత కార్మికులు, కర్షకులకే ఉందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) శుక్రవా రం కర్నూలు నగరంలో నిర్వహించిన బహిరంగసభలో వక్తలు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక అనుకూల ప్రభుత్వం కోసం రైతులు, కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని దిశా నిర్దేశం చేశారు. రైతులకు, కార్మికులకు వ్యతిరేకంగా పని చేస్తున్న రాష్ట్రంలోని జగన్ సర్కారుపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎఐకెఎస్ ఆలిండియా కౌన్సిల్ సమావేశాలను పురస్కరించుకొని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ఓల్డ్ సిటీ అంబేద్కర్

మిగతా 2లో

## పొట్టి శ్రీరాములు చేసిన
# త్యాగం మరువలేనిది

- కర్నూలు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



2లో

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీనారపురెడ్డి మౌర్య

## ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన ఘనత
# పొట్టి శ్రీరాములుదే

**నంద్యాల నూనెపల్లె, మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్రం కోసం 58రోజులు 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన ఘనత పొట్టి శ్రీరాములుదేనని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా కొనియాడారు. పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సంజీవనగర్ కూడలిలో ఉన్న ఆయన

మిగతా 2లో



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, డీఆర్వో పుల్లయ్య, గంగిశెట్టి శ్రీధర్‌లు

సూర్య



# విభజించి పాలిస్తున్న మోడీ ప్రభుత్వం

(మొదటిపేజి తరువాయి..)



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

విగ్రహ కూడలిలో బహిరంగ సభ జరిగింది. అంతకుముందు కొత్త బస్ స్టాండ్ సుందరయ్య సర్కిల్ నుంచి సభాస్థలి వరకు ప్రదర్శన నిర్వహించారు.ర్యాలీలోరైతులు,వ్యవసాయ కార్మికులుఎర్ర జెండాలు చేతబూని పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 'రైతు రక్షణకు మోడీని గద్దె దించాలి, రైతును రక్షించాలి దేశాన్ని కాపాడాలి' అంటూ నినదించారు. బహిరంగ సభకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.క్రిష్ణయ్య అధ్యక్షత వహించారు. పదేళ్ల మోడీ జమానాలో లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే చెప్పారు. ఇంకా ఏమన్నారంటే... అంత మంది రైతులు ఎందుకు చనిపోయారు? పంటలకు కనీస మద్దతు ధర రాక నష్టాలు భరించలేక బలవంతంగా తనువు చాలించారు. క్వింటాలు వరి ధాన్యానికి ప్రకటించిన ఎంఎస్పి రూ.2,160, ఎక్కడా 1,600 కూడా రావట్లేదు. అదే కేరళ వామపక్ష ప్రభుత్వం 2,850 ఇస్తోంది. మోడీ ప్రభుత్వానికి, జగన్ సర్కారుకు, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు సవాల్ విసురుతున్నా. కేరళలో మాదిరి ధర ఇవ్వగలుగుతారా? ప్రస్తుత పరిస్థితుల్లో రైతాంగ పోరాటాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. మహారాష్ట్రలో రైతులు పోరాడి 40 వేల కోట్ల రుణాలు మాఫీ చేయించుకున్నారు. రాజస్థాన్లో పది వేల కోట్లు రద్దు చేయించుకోగలిగారు. రైతుల రుణాలు రద్దు చేయమని అడిగితే మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు 15 లక్షల కోట్లు మాఫీ చేసింది. తెలుగునాట అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటం, సుందరయ్య నాయకత్వాన సాగిన వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో రైతులు ఉద్యమించాలి.

**అబద్ధాల్లో నెంబర్ వన్ :** అబద్ధాలు చెప్పడంలో, ప్రజలను మోసం చేయడంలో మోడీ, బిజెపి నంబర్వన్ ఉన్నారని ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా అన్నారు. దేశ భద్రత తమకు ముఖ్యమని మోడీ



సమావేశానికి హాజరైన ప్రజలు

చెబుతుండగా, పార్లమెంట్లోకి దుండగులు ప్రవేశించారని, దీనిపై ప్రధాని ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ప్రజల సమస్యలు మోడీకి పట్టవన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ఎంఎ గఫూర్ మాట్లాడుతూ నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు వీరోచితంగా పోరాడి మోడీ చొక్కా పట్టుకొని రద్దు చేయించుకున్నారన్నారు. లేబర్ కోడ్ల విషయంలో కార్మికులు ఆ పని చేయలేకపోయారని చెప్పారు. దేశ రాజకీయాలను మార్చే శక్తి రైతులకు ఉందన్నారు. కార్మికులు, రైతులు కలిసి సమరశీల పోరాటాలు నిర్వహించాలని కోరారు. రాయలసీమలో తీవ్ర కరువుతో రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు అల్లాడు తున్నారని, పనుల కోసం వలసలు పోతున్నారని, రాయలసీమ బిడ్డ అని చెప్పుకునే సిఎం జగన్కు బుద్ధి ఉండా అని ప్రశ్నించారు. సభకు అధ్యక్షత వహించిన వి క్రిష్ణయ్య మాట్లాడుతూ రైతులేం చేస్తున్నారు. వారి పరిస్థితేంటి అని చర్చించేందుకు కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఎఐకెఎస్ మద్దతు తెలుపుతూ తీర్మానించిందని తెలిపారు. ఈ నెల 21న అన్ని గ్రామాల్లో రైతు సమస్యలపై వినతి పత్రాలివ్వాలన్నారు. సభలో ఎపి రైతుసంఘం కార్యదర్శి కె ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే కరువు జిల్లా కర్నూలు అని, సాగునీటి ప్రాజెక్టులు, రైతుల కష్ట నష్టాలపై ఏ ప్రభుత్వమూ దృష్టి పెట్టలేదన్నారు. పంట నష్టపోయిన రైతులను, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐకెఎస్ నాయకులు కె కృష్ణ ప్రసాద్, టి సాగర్, వై కేశవరావు, ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిఐటియు నాయకులు సభా వేదికపై ఆశీనులయ్యారు.తొలుత ఎపి రైతు సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. ప్రజానాట్యమండలి. కళాకారులు కళా ప్రదర్శనలు .విప్లవ గేయాలు ఆలపించారు.

# అంగన్వాడీల అగచాట్లు..

(మొదటిపేజి తరువాయి..)

హామీలకు అక్కలు అందరూ ఉప్పొంగిపోయి గత ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓటు వేశారు.గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో వారి వేతనాలు పెంచమని నిరసనలు చేపట్టిన వారి మొరను పక్కన పెట్టిన బాబు తగిన మూల్యం చెల్లించుకున్నారు.అలాగే పాదయాత్రలో అంగన్ వాడీల సమస్యలను తీరుస్తామని వారికి పనికి తగ్గ వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారం లోకి వచ్చిన వైఎస్ జగన్ కేవలం గత టిడిపి ప్రభుత్వంలో 10500 రూపాయలుగా ఉన్న వేతనాన్ని 11500 రూపాయలుగా పెంచుతూ మరోపక్క వారికి ప్రభుత్వం నుండి అందాల్సిన సంక్షేమ పథకాలను రద్దు చేశారు. అయితే పట్టణాలలో ఉండే అంగన్ వాడీలకు పథకాలను కొనసాగిస్తూ గ్రామాలలో మాత్రం రద్దు చేశారు. దీనిపై అంగన్ వాడీలు నిరసన చేపట్టారు. తెదేపా హయాంలో చంద్రబాబు 4200 రూపాయలుగా ఉన్న అంగన్ వాడీల వేతనాలను 7వేలుచేశారు.అయితే మళ్లీ ఎన్నికల సమయంలో 2019లో 10500లు అంగన్ వాడీలకు అందించారు.ప్రభుత్వాలు మారిపోయాయి.పాలకులు మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారి వేతనాలను11500 గా మారుస్తూ ఆయాలకు 7500 అందించారు.అయితే గత పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను అమలు పరచకుండా కేవలం వెయ్యి రూపాయలు పెంచి వారికి మొండి చెయ్యి చూపారు.ఇన్నాళు వైసిపి ప్రభుత్వానికి విన్నవించినా పేద చెవిన పెట్టిన సీఎం జగన్ వారిని చర్చలకు పిలిచారు.అయితే అంగన్ వాడీలు తమకు రావాల్సిన టి.ఏ,డి.ఏ, గ్రాడ్యుయేటి,రిటైర్మెంట్ బెని ఫిట్ను 50 వేల నుండి 5లక్షలు ఇవ్వాలని మినీ అంగన్ వాడీ సెంటర్ లను మెయిన్ సెంటర్ లుగా తీర్చిదిద్దాలని,ఆయాలకు వర్క ర్లుగా పదోన్నతి 50 ఏళ్ళ వరకు పెంచాలని,వర్కర్లకు 26 వేలు వేతనం అందించాలని, గ్యాస్,కూరగాయలు,ఇతర డబ్బులు చెల్లిం చాలని వారు కోరగా ప్రభుత్వం కేవలం టి.ఏ,డి.ఏ లను,ఆయాలకు పదోన్నతి లో 50 ఏళ్ళకి అంగీకరించింది.అయితే పనికి తగ్గ వేతనాలు ఇస్తామని చెప్పిన జగన్ ప్రస్తుతం వేతనాలు పెంచలేము అని చేతులు ఎత్తేశారు.అయితే వైఎస్ జగన్ పాదయాత్రలో చెప్పిన హామీలను మాత్రమే అడుగుతున్నామని నాడు చంద్రబాబు ను కాదని జగన్ మాటలు నమ్మి వైసీపీ గెలుపులో ప్రధాన పాత్ర వహించామని అంగన్ వాడీలు తెలిపారు.నేడు వేతనాలు పెంచకపోగా అన్ లైన్ రికార్డు అంటూ పేస్ యాప్,అధిక భారం, సెంటర్ లను పాఠశాలలోకి కలపడం,పని ఒత్తిడి సెంటర్ లలో పిల్లలపై శ్రద్ధ కంటే యాప్ లలో అప్లోడ్ చేయడం ఎక్కువగా సమయం తీసుకుంటుందని అనవసర యాప్లను రద్దు చేయాలని,అలాగే పక్క రాష్ట్రాల లాగే వేతనాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తూ ఈ నెల 12 నుండి నిరసన కార్యక్రమాలు చేపట్టారు.అయితే ప్రభుత్వం అంగన్ వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి సెంటర్లను ఓపెన్ చేయాలని ఇందుకు తహాశీల్దార్,ఎంపిడిఓ అధికారుల ఆధ్వర్యంలో వాలంటీర్లు,మహిళా పోలీస్లకు భాద్యతలు అప్పచెప్పారు.అయితే రెవెన్యూ అధికారులు అంగన్ వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టి సెంటర్ లను తెరచి పిల్లలకు గుడ్లు,పౌష్టిక ఆహారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.అయితే అంగన్ వాడీలు ముందుగానే పిల్లలకు,గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం,గుడ్లు,పాలు అందించి వారికి అవకాశం ఇవ్వకుండా చేశారు.అలాగే తమ డిమాండ్ లను నెరవేర్చకుండా అడ్డుపడుతున్న రెవెన్యూ అధికారులపై తిరగబడుతూ వారు రెవెన్యూ కార్యాలయాలకు సిఐటియు ఆధ్వర్యంలో తలుపులు కు ఘడియలు పెట్టడానికి ప్రయత్నించారు.ఆస్పరి లో పోలీసులు అడ్డుకోవడంతో అంగన్వాడీలు,పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.దీంతో అంగన్ వాడీలకు మద్దతుగా తేదేపా నాయకురాలు కోట్ల సుజాతమ్మ,ఇతర పార్టీల నాయకులు మద్దతు పలుకుతున్నారు.ఏది ఏమైనా అంగన్ వాడీలు,ఆశా వర్కర్ల మద్దతు ఈ సారి తెలుగుదేశం పార్టీకి గట్టిగా అందిస్తారని తెలుస్తుంది.దీంతో వైసీపీ కి రాష్ట్రంలో నూకలు చెల్లినట్లు కనబడుతుంది.



ఆలూరు లో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

# ఫరూక్ – భూమా వర్గాలు కలిసేనా.. !

(మొదటిపేజి తరువాయి..)

కొనసాగుతున్న వైరి వర్గాలైన భూమా, ఫరూక్ల వర్గాల మధ్య స్పష్టత రాకుండానే సమావేశం ఏర్పాటు చేయడంపై మేజర్న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

సార్వత్రిక ఎన్నికలు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. సామాజిక సమీకరణాలతో రాష్ట్ర వ్యాప్తంగా సీట్ల సర్దుబాటును తెదేపా చేపట్టింది. అందులో భాగంగానే నంద్యాల ఇన్చార్జిగా భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించి సీనియర్ నేత మాజీ మంత్రి ఫరూక్ ఇన్చార్జి బాధ్యతలను అధిష్టానం అప్పగించింది. ఊహించని పరిణామంతో ఖంగుతున్న భూమా వర్గం పార్టీ పదవులకు రాజీనామ చేసిన విషయం పాఠకులకు విధితమే. అధిష్టానం ఇద్దరు నేతలు కలసి పని చేయాలని సూచిస్తుంది. ఈ క్రమంలో మాజీ మంత్రి ఫరూక్ మర్యాద పూర్వకంగా భూమా బ్రహ్మానందరెడ్డిని ఆయన పార్టీ కార్యాలయంలో కలిసిన విషయం పాఠకులకు విధితమే. ఇద్దరు నేతలు గంటసేపు సమావేశమైన విషయం తెలిసిందే. సమావేశం అసంపూర్తిగానే ముగిసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇప్పటి వరకు భూమా ఫరూక్ వర్గాలు ఒకే వేదికపైకి రాలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓడిన భూమా బ్రహ్మానందరెడ్డి నాలుగున్నర ఏళ్ళుగా ఇన్చార్జిగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. టీడీపీ అధిష్టానం మైనార్టీలకు రాయలసీమలో సీట్ల కేటాయింపులో భాగంగా నంద్యాల అసెంబ్లీని ఎంచుకున్న విషయం పాఠకులకు విధితమే. ఇదే సమయంలో ఫరూక్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశ సమాచారాన్ని ఫరూక్, భూమాకు అందించారు. భూమా వర్గం పార్టీ పదవుల్లో కొనసాగుతున్న విషయం పాఠకులకు విధతమే. ఇన్చార్జి మార్పుతో భూమా వర్గం పార్టీ పదవులకు రాజీనామ చేసిన విషయం తెలిసిందే. ఇరువర్గాల మధ్య అవగాహన కుదరకుండానే సమావేశం ఏర్పాటు చేయడంపై భూమా వర్గం అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో భూమా, ఫరూక్ల మధ్య సమావేశం ఏర్పాటు చేసేందుకు నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మండ్ర శివానందరెడ్డి చొరవ తీసుకున్నట్లు తెలుస్తోంది. విస్తృత స్థాయి సమావేశానికి ముందే ఇద్దరు నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దివంగత భూమా శోభానాగిరెడ్డి జయంతి శనివారం ఉండటంతో భూమా బ్రహ్మానందరెడ్డి నంద్యాలలో అందుబాటులో ఉండకపోవచ్చునని తెలుస్తోంది. ఫరూక్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలియడంతో రాయలసీమ జోనల్ ఇన్చార్జి మాజీ మంత్రి అమరనాథ్రెడ్డి ఇద్దరు నేతలతో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇరువర్గాల మధ్య అవగాహన కుదరకుండా సమావేశం ఏర్పాటు చేయడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరు నేతల మధ్య అవగాహన కుదిరిన తర్వాత సమావేశం ఏర్పాటు చేస్తే బాగుండేదని ఫరూక్కు ఆయన సూచించినట్లు తెలుస్తోంది. అప్పటికే సమావేశం సమాచారం టీడీపీ ముఖ్య నాయకులకు, ద్వితీయ శ్రేణి నాయకులకు , కార్యకర్తలకు అందించినట్లు ఫరూక్ ఆయనకు తెలిపినట్లు తెలుస్తోంది. మొత్తం మీద విస్తృత స్థాయి సమావేశంలో ఒకే పార్టీలో కొనసాగుతున్న భూమా ఫరూక్ వర్గాలు కలసి ఒకే వేదికను పంచుకుంటాయా లేదా అన్నది వేచి చూడాలి.

# ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన ఘనత పొట్టి శ్రీరాములుదే

(మొదటిపేజి తరువాయి..)

విగ్రహానికి ఎమ్మెల్సీ ఇసాక్తో పాటు డీఆర్వో పుల్లయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్బాషా మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం అంకుఠిత నిరాహారదీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిస్తూ అమరజీవి అయ్యారన్నారు. డీఆర్వో పుల్లయ్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు మూలపురుషుడు అమరజీవిని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. దేశభాషల సమున్నతికి బలిదానం చేసిన త్యాగమూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణకు మూలపురుషుడు అని కొనియాడారు.

# పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిది

(మొదటిపేజి తరువాయి..)

**కర్నూలు, మేజర్న్యూస్ప్రతినిధి :** రాష్ట్ర అవతరణకు పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. శుక్రవారం అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యువత పొట్టిశ్రీరాములు అడుగుజాడల్లో నడిచి రాష్ట్రానికి, దేశానికి తమ వంతు సేవ చేయాలన్నారు. డీఆర్వో మధుసూధన్రావు మాట్లాడుతూ ప్రత్యేకంగా రాష్ట్రంలో పొట్టిశ్రీరాములు తన ప్రాణాలను త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి వెంకటలక్ష్మమ్మ, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డిమాండ్ సాధన కోసం అంగన్వాడీల నిరసన

**పాములపాడు, మేజర్ న్యూస్ :**



తమ డిమాండ్ల సాధనే లక్ష్యంగా అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి నాలగవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వా డీలు కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ సెంటర్ వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భ ంగా సిఐటియు,నాయకులతో కలిసి మానవ హారం చేపట్టారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కనీస వేతనం, పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, పనిభారం తగ్గించాల ని, ఆయాలకు ప్రమోషన్ వయస్సు 50 సంవత్సరాలకు పెంచాలని తదితర అంశాలపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్నికల హామీలలో భాగంగా తెలంగాణ కంటే ఎక్కువ వేత నం ఇస్తానన్న సిఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఒకవైపు మేము శాంతి యుతంగా నిరసన తెలుపుతుంటే మరొకవైపు అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ం తమ డిమాండ్లు అంగీకరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. అనంతరం ఎంపీడీ వో. తహాసిల్దార్ కార్యాలయ వద్దకు ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో రత్న రాధిక, ఎంపీడీవో గోపి కృష్ణలకు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేయండి



జనసేన పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న జనసేన పార్టీ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న

- వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దాం
- జనసేన పార్టీ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న పిలుపు

**కౌతాళం, మేజర్‌న్యూస్ :** గ్రామస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేయాలని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దామని జనసేన పార్టీ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని చిరుతపల్లి, చూడి, కరణి, మల్లన్నహట్టి గ్రామాల్లో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మల్లన్నహట్టి గ్రామంలో జనసేన కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వచ్చే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి రాష్ట్రంలో జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనకబడి ఉందని, ప్రజలపై ప్రభుత్వం నిత్యావసర ధరల భారాన్ని మోపి ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎప్పటికప్పుడు జనసైనికులు ప్రజలకు మద్దతుగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికై ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. జనసేన అధినేత, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మార్గనిర్దేశం మేరకు కార్యకర్తలు, నాయకులు నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్, రవికుమార్, లోఅ్మరి, కోసిగి రమేష్, ఈరారెడ్డి, గణేష్, బసవ, చిన్న, నరసింహా, మల్లయ్య, నరసప్ప, మహాదేవ తదితరులు పాల్గొన్నారు.

# 17న విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వినియోగదారులు, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న 8, 9వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు జాతీయ వినియోగదారుల దినోత్సవం 2023 సందర్భంగా ఈనెల 17వ తేదీన ఆదివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు బస్టాండ్ వద్ద ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణంలో, ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ విద్యార్థినీ, విద్యార్థులకు పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సి కళాశాల లో సోమవారం ఉదయం 11గంటలకు ఈ కామర్స్, డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణ అనే విషయంపై తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో ఏర్పాటైన వినియోగదారుల క్లబ్ విద్యార్థినీ విద్యార్థులకు గోడపత్రికలు, మేము సైతం పుస్తకంపై కేవలం తెలుగులో క్విజ్ పోగ్రాంలో వినియోగదారుల క్లబ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

**జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాల కోసం దరఖాస్తులు:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకం కొరకు సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలహీనమైన, వెనుకబడిన వర్గాల సంబంధించిన నుంచి దరఖాస్తుల కోరుతున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం సాధికారిత అధికారి చింతామణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈపథకానికి యుపిఎస్‌సి నిర్వహించే ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులని, ఈ పథకం ద్వారా కింద నగదును అందించబడుతుందని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.లక్ష నగదు ప్రోత్సాహకం, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు నగదు ప్రోత్సాహకం అందించబడుతుందన్నారు. 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అర్హులైన అభ్యర్థు లకు నగదు ప్రోత్సాహకం కోసం దరఖాస్తులు ఆ హ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తును నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు.

# అంగన్‌వాడీల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా...

- టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప
- అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు



అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలుపుతూ మాట్లాడుతున్న చెన్నబసప్ప

**కౌతాళం, మేజర్‌న్యూస్:** అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప అన్నారు. ఈ మేరకు శుక్రవారం కౌతాళంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ చేస్తున్న నిరవధిక సమ్మెకు టీడీపీ నాయకులు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి క్లస్టర్- ఇన్‌చార్జి అల్లూరి వెంకటపతిరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గర్భిణీలకు, చిన్నారులకు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. వారికి ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం గడపడం చాలా కష్టంగా మారిందన్నారు. అంతేగాకుండా అంగన్‌వాడీ సెంటర్‌ల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డా.రాజానంద్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు, నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చండి

**గడివేముల, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఎన్నికలలో అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కంటే అధనంగా వేతనాలు ఇస్తామన్న ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. సమ్మెలో భాగంగా నాలుగవ రోజు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం నుండి అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు ర్యాలీగా పాత బస్టాండ్ సర్కిల్ వరకు వెళ్లి మానవహారం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా సమ్మె నిర్వహించారు. అంగన్‌వాడి యూనియన్ నాయకులు అధ్యక్ష కార్యదర్శులు వసంతమ్మ, రామ చిన్నమ్మలు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటి, కనీస వేతనాల పెంపుదల, బకాయి పడ్డ సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరారు. అంగన్‌వాడి కార్మికుల సమస్యల కోసం నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు అందజేయడం శాంతియుత నిరసనలు, ధర్నాలు, హక్కుల కోసం పోరాటం చేశామని అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు,



పాత బస్టాండు కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు, వేతనంలో సగం పించన్, మెడికల్ లివ్, మే నెలలో పూర్తిగా సెలవు దినాలు, అంగన్‌వాడి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం వంటి న్యాయ పరమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకపోతే రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనం కోసం స్థలం కేటాయించాలి



**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలో అంబేద్కర్ భవనం కోసం స్థలం కేటాయించాలని దళిత సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షులు క్రిష్ణ తహశీల్దార్ శ్రీనివాసులును కోరారు. ఈ సందర్భంగా క్రిష్ణ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో చుట్టుపక్కల వున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మరియు బహుజనులు పట్టణంలో బ్యాంక్ కోచింగ్ కొరకు అదే విధంగా గ్రూప్-1, గ్రూప్-2, ఉపాధ్యాయుల పోస్టుల కొరకు పట్టణంలో వుండి కోచింగ్ తీసుకుంటున్నారని అలాంటి వారికోసం ప్రభుత్వం వెంటనే స్పందించి డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




కొత్తపల్లిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని 18 సంవత్సరాలు నిండిన మహిళలకు మాత్రమే వివాహం చేయాలని ఎంపీడీఓ మేరి, ఏరియా కో ఆర్డినేటర్ పుల్లయ్యలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయం నుంచి బస్టాండు వరకు పొదుపు మహిళల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానమని లింగ వివక్షత ఉండకూడదన్నారు. ఆడపిల్లలకు చిన్న వయస్సులో వివాహం చేయరాదన్నారు. ఇలా చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. అనంతరం జెండర్ కమిటి యొక్క ముఖ్య ఉద్దేశ్యంను వివరించారు. జెండర్ రీసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా లింగ వివక్షతకు గురైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

# క్షయవ్యాధిని మందులతో నయం చేయవచ్చు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రవికుమార్

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** క్షయవ్యాధి సోకిన వారికి సక్రమంగా మందులు వాడినట్లయితే నయం అవుతుందని సూపర్‌వైజర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని శివపురం గూడెంలోని ఆశ్రమ పాఠశాలలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు వుంటే వైద్యులను సంప్రదించాలన్నారు. గిరిజన పిల్లలలో పౌష్టికాహార లోపం వల్లే క్షయ వ్యాధి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# మహనీయుడు పొట్టి శ్రీరాములు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్:** ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని బీజేపీ మైనారిటీ మోర్చా నాయకుడు ముక్తార్‌బాషా అన్నారు. డిసెంబర్ 15వ తేదీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయిన మహాపురుషుడు శ్రీరాములు అని ముక్తార్‌బాషా కొనియాడారు. ఆంధ్రులకు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు.

# నాల్గవరోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



**బనగానపల్లెరూరల్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలో ఎంపీడీవో కార్యాలయం దగ్గర అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె నాల్గవ రోజుకు చేరింది. న్యాయపరమైన డిమాండ్ల కోసం వారు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. న్యాయపరమైన తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె ఆగదని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరీదేవి పల్లకి సేవ



**బనగానపల్లెరూరల్,న్యూస్:** నందవరంలో వెలిసిన సాక్షిమాత శ్రీ చౌడేశ్వరీదేవి పల్లకీసేవను శుక్రవారంనాడు వైభవంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారంనాడు ఆలయంలో హాజరైన భక్తుల సమక్షంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అలంకరించి పల్లకీలో కూర్చొబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీసేవ నిర్వహించడం జరుగుతుంది.

# అధికారులతో సమీక్షా సమావేశం

**కౌతాళం, మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కౌతాళంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నూతన మండల ప్రత్యేకాధికారి కేవీఎస్‌ఎం ప్రసాద్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌లతో మెగా కంప్లీషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సచివాలయాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హౌసింగ్) లాలికృష్ణయ్య, అదనపు కార్యక్రమ అధికారి,, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, జుబేర్‌అహ్మద్, మండల విద్యాశాఖ అధికారి-2 తదితరులు పాల్గొన్నారు.

# ఉధృతమైన అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనలు

- రెండు అంగన్‌వాడీసెంటర్ల తాళాలు పగులగొట్టిన సచివాలయం సిబ్బంది
- అధికారులకు అడ్డంగా రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలిపిన అంగన్‌వాడీలు
- నాలుగవరోజు మండల వ్యాప్తంగా మూతపడిన 48 అంగన్‌వాడీ కేంద్రాలు

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** బండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా అంగన్‌వాడి కార్యకర్తల నిరసనలు, ఆందోళనలు ఉధృతమయ్యాయి. స్థానిక త హశీల్దార్ కార్యాలయం ఆవరణంలో నాలుగవ రోజు అంగన్‌వాడి కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన చేపట్టారు. మధ్యాహ్నం వరకు సాఫీగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమం పంచాయితి అధికారుల, రెవెన్యూ అధికారుల తీరుతో ఉధృతమైంది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడి కేంద్రాలను ఓపెన్ చేయాలని సంబంధిత అధికారుల సమక్షంలో పంచనామ చేసి సెంటర్లో ఉండే ఆహార పదార్థాల విషయాలను పంపిం చాల్సిందిగా ఉత్తర్వులు మండల అధికారులకు అందా యి. ఈ మేరకు మండల అధికారులు అన్ని గ్రామాల పంచాయితి సిబ్బందికి సమాచారం ఇచ్చి అంగన్‌వాడి కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. ఈ క్రమంలో బండి ఆత్మకూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడి సెంటర్ 1,5లను పంచాయితి కార్యదర్శి నటరాజ్, వీఆర్ఓ యేసుపాదం ఆధ్వర్యంలో అంగన్‌వాడి కేంద్రాల తాళాలు పగులగొట్టి పంచనామ నిర్వ హించారు. విషయం తెలుసుకున్న నిరసన చేస్తున్న అంగన్‌వాడి కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి అధికారులతో తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనలు చేపడుతుంటే ఇలా అధికారులు తమ అంగన్‌వాడి సెంటర్ల తాళాలు పగులగొట్టడంపై వాగ్వి వాదంకు దిగారు. కనీసం గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు లేకుండా పంచనామ ఏ విధంగా నిర్వహిస్తారని ప్రశ్నిం చారు. మిగతా అంగన్‌వాడి కేంద్రాల తాళాలు పగుల గొడుతారన్న ఉద్దేశ్యంతో అక్కడే అధికారులకు అడ్డంగా గంటన్నర సేపు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓతో ఫోన్లో అంగన్‌వాడి కార్యకర్తలు మాట్లాడి అక్కడినుండి ర్యాలీగా వెళ్లి దీక్షా శిబిరంతో నిరసన కార్యక్రమాన్ని మళ్లీ చేపట్టారు. వీరికి సీఐటీయూ నాయకులు రత్నమయ్య, ఎంఆర్‌పీయస్ నాయకులు సుబ్బన్న, అంగన్‌వాడి కార్యకర్తల సంఘం సభ్యులు ఆనందమ్మ, వసంత, రమణమ్మ, శ్యామల, సభ్యులు పాల్గొన్నారు.


రోడ్డుపై అధికారులకు అడ్డంగా నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా సంజీవనగర్ గేట్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి బింగుమళ్ళ శ్యాంసుందర్‌గుప్త, అధ్యక్షులు భవనాశి నాగమహేశ్, ప్రధాన కార్యదర్శి విజయశేఖర్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్ ఖండే శ్యాసుందర్‌లాల్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ వాణిజ్య విభాగం వైస్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి వాసు, నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి రామకృష్ణ, మహిళా మండల అధ్యక్షురాలు ఇందుమతి, సభ్యులు కొత్త సుబ్బయ్య, మురళి, కశెట్టి చంద్రశేఖర్, శివశంకర్, పసుపుల రవి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పొట్టి శ్రీరాములుకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.


అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

## జడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న దృశ్యం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని నన్నూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి, ఆర్‌డీవో అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్‌పాల్ తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## నేడు రాజ్‌కుమార్ ఫౌండేషన్ 7వ వార్షికోత్సవం



**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** సమాజంలో తమ వంతు బాధ్యతగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న రాజ్‌కుమార్ ఫౌండేషన్ నేడు 7వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ బి.రత్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎపిజె అబ్దుల్ కలాం 92వ జయంతిని పురస్కరించుకుని ఆయన ఆదర్శంగా తీసుకుని సమాజంలో నిస్వార్ధ సేవలందిస్తున్నారన్నారు. అంటి వారిని గుర్తించి రాజ్‌కుమార్ ఫౌండేషన్ ద్వారా ఆయా రంగాల్లో పని చేస్తున్న వారిని ఘనంగా సన్మానించి సత్కరిస్తునట్లు పేర్కొన్నారు. కర్నూలు బిర్లా కాంపౌండ్‌లోని బ్రహ్మరెడ్డి ఆస్రృతి 4వ అంతస్తు మినీ మీటింగ్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7569325354కు సంప్రదించాలని కోరారు.

## నిర్మాణం పూర్తయిన ఫుట్‌వేర్ బ్రిడ్జి



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో నేషనల్ హైవే అథారిటీ నిర్మిస్తున్న ఫుట్‌వేర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. రూ.1.50కోట్లు ఖర్చు చేసి బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. విద్యార్థులు హైవే దాటేందుకు సులభంగా ఉండే విధంగా ఈ నిర్మాణం జరిగింది. త్వరలో ఈ బ్రిడ్జిని ప్రారంభించనున్నారు.

## మంత్రి సహకారంతో ఎల్లార్తిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో సర్పంచ్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైసీపీ నాయకులు ప్రారంభించారు.రూ.10 లక్షల నిధులతో గ్రామంలోని కన్నడ పాఠశాల నుండి కొళి రామలింగమ్మ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు నాయకులు దరగప్ప,ఎస్‌కే గిరి తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు,ప్రజలు మంత్రికి ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో రుద్రయ్యస్వామి, శంక్రప్ప, పంప, శ్రీనివాసరెడ్డి, దుర్గప్ప, శేషి, ఈరన్న, పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

# బుడగ జంగాల సమస్యలు పరిష్కరిస్తాం : ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం బుడగ జంగాల నాయకులు తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో బుడగ జంగం కులస్తులు తెలుగుదేశం పార్టీ నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండి ఫరూక్ ను కలిసి తమ సమస్యలు విన్నవించుకోవడం జరిగింది. ఈసందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు నుంచే సంచార జాతులైన బేడ బుడగ జంగాలు కూడు, గూడు, గుడ్డ కోసం కళను నమ్ముకుని దేశ వ్యాప్తంగా తిరిగి బుర్రకథలు చెప్పే రోజులు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. జగన్ పాదయాత్ర సాక్షిగా బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేరుస్తామని మాట ఇచ్చి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారని వారికి ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. అన్ని రంగాల్లో వెనుకబడిన బుడగ జంగాలకు ఎస్సీలకు ఇచ్చినట్లే అనేక సంక్షేమ పథకాలు వివాహా కానుక రూ.40వేలు, విదేశాల్లో విద్యాభ్యాసంకు రూ.10లక్షలు అందించిన ఘనత నారా చంద్రబాబునాయుడుదని గుర్తు చేశారు. బుడగ జంగాలకు ఉరితాడుగా మారిన 2008 నాటి జిఓ 144ను రద్దు చేసి దాని స్థానంలో కొత్త జీఓ ఇచ్చి ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చేలా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణా, కర్నాటక, మహారాష్ట్రలో మాదిరిగానే బుడగ జంగం కులస్తులకు ఎస్సీ జాబితాలో చేర్చేందుకు జేసీ శర్మ కమిషన్ ఇచ్చిన నివేదికపై కాలయాపన చేయకుండా దానిని ఆమోదించి కేంద్రానికి పంపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిలాళ్ల ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, బుడగ జంగాల నాయకులు జమ్మన్న, రమణ, పుల్లయ్య, సుంకన్న, సురేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.


బుడగ జంగాల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్

## ముగింపు విజయోత్సవ సభను విజయవంతం చేయండి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈ నెల 20వతేదీన ముగుస్తుందని, ఈ సందర్భంగా చేపట్టిన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని తమ నివాసంలో పాణ్యం నియోజకవర్గంలోని అన్ని మండలాలల నాయకులు, కార్యకర్తలు, కల్లూరు అర్బన్ వార్డు ముఖ్యనాయకులు, వార్డు ఇన్‌చార్జిలు, టీడీపీ అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, రామాంజనేయులు, దేశం సత్యనారాయణరెడ్డి, జయరామిరెడ్డి, మంచాలకట్ట వంగాల శ్రీనివాసరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, సీతారామిరెడ్డి, లాయర్ బాబు, రమణమూర్తి, మాదేష్, పార్వతమ్మ, రామక్రిష్ణ, కాసాని మహేష్‌గౌడ్, బ్రహ్మణపల్లె నాగిరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, జవ్వాజి గంగాధర్‌గౌడ్, ఫిరోజ్, ఆచారి, మాదన్న, కేతూరు మధు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

## రజకుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** రజకల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని రజక సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గురప్పసాల రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని బీసీ భవన్‌లో రజక సాధికార కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ రజకులు సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. రజకుల సంక్షేమం కోసం వైసీపీ ప్రభుత్వం చేసిన కృషి శూన్యమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రజకులను న్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రజక సాధికార కమిటీ నాయకులు వెంకటేశ్వర్లు, గణేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఐక్యత చాటుతున్న దృశ్యం

## అంగన్‌వాడీ తాళాలు పగులగొట్టిన గ్రామాల నాయకులు

- నిరసన కొనసాగించిన అంగన్‌వాడీ టీచర్లు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలో అంగన్‌వాడి కేంద్రాల తాళాలను అధికారులు, గ్రామ నాయకులు పగులగొట్టి తాళాలు తెరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడి టీచర్లు కొనసాగిస్తున్న నిరసనలలో భాగంగా మహానంది మండల అంగన్‌వాడి టీచర్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలు కొనసాగిస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఇబ్బందులు పడకూడదని తాళాలు పగులగొట్టి కేంద్రాలు తెరచి గ్రామ వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. మండ లంలో అంగన్‌వాడి కేంద్రాలను గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పగులగొట్టారని గ్రామస్తులు తెలిపారు. మండల అంగన్‌వాడి టీచర్లు కొనసాగిస్తున్న నిరసనలో భాగంగా శుక్రవారం తహశీల్దార్ జనార్ధన శెట్టికి డిప్యూటి తహశీల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. వారి వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా లని కోరారు. తాము నిరసనలలో వుంటే అంగన్‌వాడి కేంద్రాల తాళాలు పగులగొట్టడం సరైన చర్య కాదని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడి సిబ్బంది పేర్కొన్నారు.


మండలం బుక్కాపురం గ్రామంలో అంగన్‌వాడి కేంద్రం తాళాలు పగుల గొడుతున్న దృశ్యం

## రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారెంటీ..



**హాలహర్వి, మేజర్,న్యూస్ :** తెలుగుదేశం పార్టీని ఆధరించి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ను గెలిపించాలని ఆలూరు టిడిపి ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం హాలహర్వి మండలంలోని శిరిగాపురం గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలను తెలుసుకున్నారు.గ్రామంలో మంచినీటి సమస్య కోసం సంబంధిత అధికారులు తో మాట్లాడారు.రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగు పడాలంటే చంద్రబాబు ను ముఖ్యమంత్రి గా చేయాలన్నారు.అలాగే రోడ్డు సమస్యను కూడా తీరుస్తామన్నారు.మహిళలకు మూడు గ్యాస్ సిలెండర్ లు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్ నాయుడు,రఘు రెడ్డి,ఉమాకాంత్ స్వామి,కమలాకర్ నాయుడు,వలి, మల్లిగౌడ్,బసవన్న గౌడ్, శంకర్ గౌడ్,చంద్ర,రామన్న గౌడ్,ఓంకార్ గౌడ్,లాలేప్ప, శీనప్ప,ఈ రప్ప,భీమలింగ, ఎర్రప్ప గౌడ్,లు పాల్గొన్నారు.

## తెలుగుదేశంపార్టీ ప్రమాద బీమా రూ. 2లక్షలు పంపిణీ

**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** బేతంచెర్ల మండల పరిధిలోని ఆర్. బుక్కాపురం గ్రామానికి చెందిన నాగార్జున అనే వ్యక్తి గత 6 నెలల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు.మృతునికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండడంతో డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి తెలుగుదేశంపార్టీ ప్రమాద బీమా రూ. 2 లక్షలు రూపాయలు టిడిపి నాయకులతో కలిసి వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పోలూరు వేంకటేశ్వరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు ఉన్నాం ఎల్లా నాగయ్య ,నాయకులు తిరుమలేష్ చౌదరి, నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి,రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఎస్టీ సెల్ కమిటీ నాయకులు రవీంద్ర నాయక్, కౌన్సిలర్ అంజి, సర్పంచ్ నాగరాజు, మండలం ఉపాధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు భూ పంపిణీ

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు మండలం కే మార్కాపురం గ్రామంలో 32 మంది లబ్ధిదారులకు చేశారు. ఈ మేరకు శుక్రవారం లబ్ధి పొందిన రైతులకు పట్టాలు అందజేశారు. గ్రామ సర్పంచ్ గణ మద్దిలేటి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలే మా పార్టీకి ముఖ్యమని పేద ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూ పంపిణీ చేశామన్నారు. రైతులను ఆదుకునేందుకే మా ప్రభుత్వం ముందు ముందు ఉంటుందని ఆయన ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం వీఆర్వో కాజా సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ఐక్యత కోసం ఒకరు, దేశ ఐక్యత కోసం మరొకరు చేసిన త్యాగాలు మరువలేనివని పీసీసీ అధికార ప్రతినిధి కరుణాకర్‌బాబు కొనియాడారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అమరజీవి పొట్టిశ్రీరాములు 71వ వర్ధంతి, సర్దార్‌వల్లభాయ్ పటేల్ 73వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు బతుకన్న, పోతుల శేఖర్, లాజరస్, ఖాజాహుస్సేన్, ప్రమీల, రియాజుద్దీన్, సత్యరాజు, చంద్రశేఖర్, అభినాయుడు, లక్ష్మయ్య, రా జేంద్రప్రసాద్, షేక్‌మాలిక్‌బాష, వశీబష, ఆనందం, జేమ్స్, బాలాజీ, ప్రసాద్, వెంకటలక్ష్మి, పుష్పలీల, కరుణమ్మ, అబీదషాహిద పాల్గొన్నారు.

## ఉస్మానియా అథ్లెటిక్ క్రీడాకారులకు అభినందనలు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** రాయలసీమ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో ఉస్మానియా కళాశాలకు చెందిన నబోసాహెబ్, హేమంత్, లింగారెడ్డి పరుగు పందెంలో విజేతలు నిలిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు.

## టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**41వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం**

**టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**

**కల్లూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమని ఆ పార్టీ పాణ్యం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు శుక్రవారం పాణ్య%శీ% నియోజకవర్గం కల్లూరు అర్బన్ 41వ వార్డ్ లేపర్సి కాలని చర్చి నందు ఇంటింటి ప్రచారం లో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కాలని లో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మెనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి పాణ్య%శీ% మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇంచార్జి గౌరు చరిత రెడ్డి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు మహిళ అధ్యక్షురాలు కే పార్వతమ్మ, 41 వ వార్డ్ ఇంచార్జి నాగేశ్వర రావు, వార్డ్ క్లస్టర్ ఇంచార్జి జనార్ధన్ ఆచారి,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్,బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్,అర్బన్ నాయకులు ధనుంజయ,బెస్త సాధికార కమిటీ సుభాష్ చంద్ర బోస్, నాగరాజు, మహేశ్ ఆచారి,వార్డ్ నాయకులు అన్వర్, ఖాదర్, సోమన్న, గాంధీ, మదు, గోసన్న, మహిళలు రాధిక, శైలజ, సుశీల, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## 5వరోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** భూ యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కర్నూలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ధర్నా చౌక్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం 5వరోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఎస్‌ఎం.ఖాద్రీ, ప్రవీణ్‌కుమార్, శ్యామలసజ్జన్, జయసింహ, శ్యాంసన్, బాబుసాహెబ్ దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగభూషణంరెడ్డి, కార్యదర్శి చక్రపాణి, లైబ్రేరియన్ కార్యదర్శి రవికుమార్, భావనకుమార్, ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## ఈవీఎంలపై అవగాహన కల్పిస్తాం

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగర ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో, మండల రెవెన్యూ కార్యాలయంలో ఈవీఎంలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అందుకోసం ఆయా కార్యాలయాల్లో ఈవీఎంలను ఏర్పాటు చేశామన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎంను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. ఈవీఎంలో ఓటు ఎలా వేయాలో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

## జీజీహెచ్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్స్ ప్రారంభం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఏడు ఆర్వో వాటర్‌ప్లాంట్స్ ప్రారంభించారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఈ ప్లాంట్స్‌ను ప్రారంభించామన్నారు. ఆసుపత్రిలో పలు విభాగాల్లో అందుబాటులోకి తీసుకవచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేశ్వరరావు, హేమనళిని, రామక్రిష్ణనాయక్, వెంకటరమణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## హెచ్‌ఎంలకు ఏరియన్స్ లీవ్‌లు ఇవ్వాలి

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో వేసవి కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులకు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఏరియన్స్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం విద్యాశాఖ కమిషనర్‌కు పీఆర్‌టీయూ లేఖ రాసినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి అంగడి లోకేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. వేసవిలో ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించినప్పటికీ ప్రధానోపాధ్యాయులు, నాన్‌టీచింగ్ ఉద్యోగులు పనిచేశారని, అందువల్ల ఆ ఉద్యోగుకలు ఏరియన్స్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

## గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం : ఎమ్మెల్యే



**తుగ్గలి, మేజర్‌న్యూస్:** గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం వచ్చిందని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మారెళ్ళ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, హెల్త్‌క్లీనిక్ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు సర్పంచ్ సుగుణమ్మ, వైసీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, లింగన్న, గణమద్దిలేటి, బత్తిని రమేష్, మంకీ రాముడు, బత్తిని సురేష్, కొత్త కురువ నరసయ్య, వడ్డెగోపాల్, బెల్లం ఆంజనేయులు బాణసంచ కాల్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు స్థానికంగా వారి సమస్యలు పరిష్కరించడానికి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకవచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జిట్టా నగేష్‌యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, సింగిల్‌విండో అధ్యక్షుడు అట్లా గోపాల్‌రెడ్డి, రాంకొండ సుధాకర్‌రెడ్డి, వైసీపీ నాయకులు తుగ్గలి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మార్పును కోరుకుంటున్న ఏపి ప్రజలు

### రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే - మాజీ ఎంఎల్ఏ కోట్ల సుజాతమ్మ

**ఆలూరు,మేజర్ న్యూస్:** రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఎవరెన్ని చెప్పినా ఆలూరు నుండి నేను బరిలో ఉంటానని ఇక్కడ తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేస్తానని ఆలూరు టిడిపి ఇంచార్జి, మాజీ ఎంఎల్ఏ కోట్ల సుజాతమ్మ అన్నారు.శుక్రవారం ఆలూరులో వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన తాలూక స్థాయి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ శత్రువును కూడా చిరునవ్వుతో ఆహ్వానించి పనులు చేసిపెట్టే కుటుంబం నాది అని ఆలూరులో పార్టీకోసం ఎవరు కష్టపడతారో వారిని గుర్తించి వారికి ఎంఎల్ఏ అయిన తర్వాత మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ఆరు సంక్షేమ పతకాలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి కష్ట సుఖాలను పంచుకోవాలన్నారు.డబ్బులు సంపాదనకోసం పార్టీలోకి రాలేదు ప్రజలకు సేవ చేద్దామని వచ్చామని మంత్రి పదవులు కూడా వద్దనుకున్నామని అన్నారు. ఆలూరుకు ఎంఎల్ఏగా ఉంటేనే అధిక నిధులు తీసుకు వస్తామని అన్నారు.ప్రస్తుతం అధికారంలో లేకున్నా మా మామ మాజీ ముఖ్యమంత్రి దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి అనుచరులు చాలామంది పదవుల్లో ఉన్నారని వారి సహకారంతో టిడిపి కార్యకర్తలకు పనులు చేసిపెడుతున్నామని అన్నారు. చాలామంది రెడ్లకు మద్దతు పలుకు తుందని చెబుతున్నారు అసలు నేను రెడ్లకు వ్యతరేకంగా ఉన్నా గత ఎన్నికల్లో నా వెంట నడిచింది బిసి,ఎస్సీ,ఎసీ,మైనార్టీలు,ఇతర కులాలు నేను పనిచేసేవారికి నా మద్దతు ఉంటుందని వారు ఎవ రైనా ఒక్కటే అని అన్నారు. అనంతరం మాజీ జడ్పిటిసి మీనాక్షి నాయుడు మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను తక్కువ అంచనా వేయకూడదని అవసరమైతే డబ్బులు,దౌర్జన్యాలు చేసి అయినా గెలవడానికి సిద్ధం అవుతారని కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు మరో నాలుగు నెలలు కష్టపడితే విజయం మనదేనని అన్నారు.తెదేపా ఎస్సీ సెల్ నాయకులు చిన్నహ్యాట శేషగిరి మాట్లాడుతూ చాలామంది తమకు ఇంచార్జి నుండి ఆహ్వానం స్వయంగా అందలేదని ఉన్నారు వారికోసం ప్రతి మండలంలో కొంతమంది నాయకులను గుర్తించి నేరుగా కోట్ల సుజాతమ్మ స్వాగతించాలని మన గెలుపు అభివృద్ధికి నాంది అని అన్నారు.డోన్ ప్రజలు తమకు కష్టాలు ఉన్నామని కోట్ల సుజాతమ్మ ఆలూరు నుండి పోటీ చేయడం మీ అదృష్టమని చెబుతున్నారంటే ఆమె ఎంత అభివృద్ధి చేసిందో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు సులక్షణరెడ్డి, ఎంపిటిసి రజని,రాష్ట్ర తెలుగురైతు కమిటి నాయకులు నారాయణరెడ్డి, మాజీ ఎంపిపికృష్ణ యాదవ్,వందవాగిలి రామలింగారెడ్డి, కృష్ణమనాయుడు, హంపయ్య, తిమ్మయ్య, నరసప్ప, మనేకుర్తి రాజశేఖర్, రఘురెడ్డి, హరిరెడ్డి, మండల కన్వీనర్లు అశోక్ యాదవ్, విజయభాస్కర్‌గౌడు, సుధాకర్‌నాయుడు, తిప్పయ్య, షేక్షావలి, విష్ణురెడ్డి, చెన్నప్ప, బండిగింజల రంగన్న, వెంకటస్వామిగౌడు, శేషాద్రి నాయుడు, తిమ్మన్న, ముత్తుకూరు మల్లికార్జున, గోవిందు, అట్టేకల్ రాజశేఖర్, దేవేంద్ర, రంగస్వామి, మద్దిలేటి యాదవ్, వెంకటేష్ రెడ్డి, యంకన్న, నాగరాజు, మాణిక్య, రాజ్‌కుమార్, పెద్దయ్య, సతీష్, దర్గన్న, ఎంపిటిసి నరసన్న, రహంతుల్లా, రమేష్ , వడ్డే గోవిందు, పెద్దయ్య, సర్పంచ్ మోహన్ రాజ్, శేఖర్, భాస్కర్, హనుమప్ప, అంజినయ్య, నరసింహులు, ఐటిడిపి రామాంజి, సర్పంచ్‌లు వెలమకూరు భాస్కర్, చిన్న రామప్ప, సుంకన్న, జలంధర్, జల్దారి నరసప్ప, నాగరాజు, సూరిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి ఇంచార్జి కోట్ల సుజాతమ్మ

సూర్య
శనివారం 16 | డిసెంబర్ 2023

# సంక్షేమ పథకాలు వైకాపాతోనే సాధ్యం


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** సంక్షేమ పథకాలు వైకాపా ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఓబులంపల్లె గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరిగి వైసీపీ ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో వైకాపా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, వైకాపా నాయకులు గంగుల రామిరెడ్డి, ఎంపీడీవో మహబూబ్ ఖాన్, ఈఓఆర్‌డి తాహేర్ హుస్సేన్,ఏపీవో గణేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ నాయక్, పంచాయతీరాజ్ ఏఈ కమల్ సాహెబ్, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ హరి, వైకాపా నాయకులు శ్రీరామి రెడ్డి, రవీంద్రారెడ్డి, జడ్పిటిసి లక్ష్మీదేవి, రామ్మోహన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేద మహిళలకు, చిన్న పిల్లలకు దుప్పట్లు పంపిణీ



**వెల్దుర్తి మేజర్ న్యూస్:** వెల్దుర్తి పట్టణంలోని నారాయణరెడ్డి నగర్ దగ్గర ఖాళీ స్థలంలో గుడారాలేసుకుని బిక్షాటన వృత్తిగా ఉన్నఅత్యంత నిరుపేదలైన మహిళలకు, చిన్న పిల్లలకు హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ తరఫున శుక్రవారం దుప్పట్లు పంచడంజరిగింది. ఈ సందర్భంగా హెల్పింగ్ ఆన్సర్ సేవా సంస్థ అధ్యక్షుడు హరి సింహానాయుడు మాట్లాడుతూ ఎంతో మంది కనీసం చలి నుంచి రక్షణగా దుప్పటి కూడా లేని పరిస్థితి చలికి వణుకుతున్న చిన్నపిల్లల్ని చూస్తే కన్నీరు ఆగడం లేదన్నారు, అంతేకాకుండా కొన్ని నిరుపేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలలో కూడా ఒకే రూము ఉన్న ఇండ్లు చాలా కనో లేకపోతే వృద్ధుల మీద ఏమాత్రం ప్రేమలేకనో చాలమంది వృద్ధులను ఆరు బయటనే నిదురించమని కుటుంబీకులు బయటకు పంపిస్తున్నారు. ఈ చలిలో వాళ్ల చిరిగిన ఒక దుప్పటి వారిని చలి పులి నుంచి రక్షించలేదు కనుక ప్రతి ఒక్కరు దుప్పట్లను మరియు వీలైతే స్వెట్టారులను నిరుపేదలకు ఇచ్చి ఆదుకొమ్మని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహనాయుడు బేడ బుడగ జంగాల సంఘం అధ్యక్షులు విభూది బాలు, మద్దిలేటి, వాలంటీర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పాతూరి వీధిలో పర్యటించిన భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి


భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** తెదేపా జనసేన ఉమ్మడి మేనిఫెస్టో భవిష్యత్తు గ్యారంటీ పథకంపై శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని పాతూరి వీధిలో తాలుక టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పర్యటించారు. ఆయనకు టిడిపి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టో పై ప్రజలకు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అవగాహన కల్పించారు. ప్రతి కుటుం బానికి చక్కటి సంక్షేమం భవిష్యత్తు బాగుండాలంటే తెదేపా జనసేన పార్టీలకు మద్దతు పలకాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ హుస్సేన్‌భాష , మాజీ జెడ్పిటిసి చాంద్ భాష, నన్నేబై గారి జిలాన్, సోముల శేఖర్ రెడ్డి, సోముల మోహన్ రెడ్డి,చింతకుంట్లరామశేఖర్ రెడ్డి, ఇటిక్యాల శేఖర్ రెడ్డి, రామాచారి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

# మహనీయుల అడుగు జాడల్లో నడవాలి


పొట్టిశ్రీరాములకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** మహనీయుల అడుగు జాడలో నడవాలని బనగానపల్లె బీజేపి నాయకులు అన్నారు. శుక్రవారం నాడు సర్ధార్ వల్లభాయ్ పటేల్ 73వ వర్ధంతి మరియు ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసిన పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించారు. బనగానపల్లె భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపి కన్వీనర్ బి.వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులు అర్పించడంతోపాటు పొట్టిశ్రీరాములు సెంటర్ వద్దకు చేరుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె మండల ప్రెసిడెంట్ యాదగిరి, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ శరత్, నాగార్జున, వెంకటేష్, జావిద్‌బిన్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం..

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** నేడు మూడవ శనివారం విద్యుత్ లైన్లు మరియు సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా వెల్దుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెల్దుర్తి సబ్ స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు త్రీఫేస్ వ్యవసాయ విద్యుత్తు వేళలు ఈ విధంగా ఉంటాయని పేర్కొన్నారు.అన్ని ఫీడర్లు ఉదయం 6.00 నుండి 9.00 మరియు 11.00 నుండి 3 గంటల వరకు అంతరాయం కలగనున్నట్లు తెలిపారు.

# పొట్టిశ్రీరాములు సేవలు మరువలేనివి – బీసీ రాజారెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** అమరజీవి పొట్టిశ్రీరాములు సేవలు మరువలేనివని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారంనాడు అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ 58 రోజులపాటు నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసి రాష్ట్రాన్ని సాధించిపెట్టారని అలాగే మన తెలుగు వారిని మద్రాసు వాళ్లు చాలా చులకనగా చూసేవారని అది సహించలేక తెలుగు వారికి వేరు రాష్ట్రం కావాలని నిరాహారదీక్క్ష చేపట్టి రెండు తెలుగు రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పొట్టిశ్రీరాములు స్మృతి వనాన్ని ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఘనంగా జయంతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లాయర్ నాగేంద్ర రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఖాదర్, జంగంశెట్టి, భాస్కర్, రాంగోపాల్, తదితరులు పాల్గొన్నారు.


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

# టిడిపి ఎన్నికల శంఖారావం సభను దిగ్విజయం చేయాలి

**➲ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు**

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ఈనెల 20వ తేదీన తెలుగుదేశం పార్టీ నిర్వహించనున్న ఎన్నికల శంఖారావం సభను ప్రతి ఒక్కరూ హాజరయ్యి దిగ్విజయం చేయాలని ఆదోనినియోజకవర్గం టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు పిలుపునిచ్చారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం ఆదోని టిడిపి కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో కలిసి విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈ నెల 20 తేదీన నెల్లిమర్ల నియోజకవర్గంలోని పోలిపల్లిలో ముగింపు సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సభతోనే టిడిపి ఎన్నికల శంఖారావం మొదలవుతుందని స్పష్టం చేశారు. ఈ సభకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదోని నియోజకవర్గంలో త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, కర్నూలు జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, రామస్వామి, అప్సర భాషా, వెంకటేష్ చౌదరి, క్లస్టర్ యూనిట్ బూత్ కన్వీనర్లు, నందమూరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

# అంగన్‌వాడీ సెంటర్ తాళాలు ధ్వంసం

**– తాళాలను తొలగించిన అధికారులు**
**– ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందించాలి**


అంగన్‌వాడి సెంటర్ తాళాలను తొలగిస్తున్న అధికారులు

**కోసిగి మేజర్ న్యూస్:** కోసిగి మండలంలో అంగన్‌వాడి సెంటర్ తాళాలను అధికారులు ద్వంసం చేయడం జరిగింది. శుక్రవారం తహాశీల్దార్ రుద్రగౌడు ఆధ్వర్యంలో మూసిఉన్న అంగన్‌వాడి సెంటర్ తాళాలను తొలగించి కొత్త తాళాలను అధికారులు వేయడం జరిగింది. కోసిగిలోని పెద్దమార్కెట్ అంగన్‌వాడి సెంటర్, 6వ వార్డులోని యస్‌సి కాలనీలో ఉన్న అంగన్‌వాడి సెంటర్ తాళాలను తొలగించి సచివాలయ అధికారులకు అప్పగించడం జరిగింది. అంగన్‌వాడి కార్యకర్తలు నాలుగురోజుల పాటు సమ్మె చేయడంతో గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించకుండా అంగన్‌వాడి కార్యకర్తలు సమ్మె చేయడం జరిగిందన్నారు. దీనితో వారికి అందాల్సిన పౌష్టికాహారం అందకుండా అంగన్‌వాడి సెంటర్‌లోనే ఉండడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సెంటర్‌తాళాలను తీసి సరుకులను పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడి కార్యకర్తలు సమ్మెను కొనసాగిస్తున్నా.. ప్రజలకు మాత్రం పౌష్టికాహరంను అందించాలని జిల్లా అధికారుల ఆదేశాలున్నా అంగన్‌వాడి కార్యకర్తలు పట్టించుకోకపోవడంతో నేరుగా అధికారులే పంపిణీచేయడం జరుగుతుందన్నారు.

# అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి- సిఐటియు

**చాగలమరి ,మేజర్ న్యూస్ :** అంగన్వాడీల న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల సిఐటియు నాయకులు గుత్తి నర్సింహులు, ఈ మహబూబ్ బాషాలు కోరారు. శుక్రవారం స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన దీక్ష నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు మండల సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలన్నారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీలందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లు గా మార్చాలన్నారు . మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు అనంతరం అంగన్వాడి కార్యకర్తలు సహాయకురాళ్లు భారీ ర్యాలీగా తరలి వెళ్లి మెయిన్ బజార్ లోని తాసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని తాసిల్దారుకు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సంఘం నాయకులు పద్మావతి, అస్సానమ్మ, వసంత, నాగమణి ,వై పద్మావతి, సంజీవమ్మ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మెను కొనసాగిస్తుండగానే అంగన్వాడి సెంటర్లను ప్రభుత్వ కార్యదర్శులతో సచివాలయ సిబ్బందితో సెంట్రల్‌ను తెరిపించాలని ఆలోచనలో ప్రభుత్వంఉంది. శుక్రవారం మండలంలోని ఐదు సెంటలను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మద్దూర్ సెంటరు, గొడిగనూరు 2, కేపీ తండా, చాగలమరి 18వ సెంటర్ ను అధికారులు తెరిపించడం జరిగింది. ప్రభుత్వం తలపెట్టిన చర్చలు ఫలించక పోతే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, స్కూళ్లతో కమిట్ అయినటువంటి సెంటర్లలో పరిధిలోని టీచర్లతో, మహిళా పోలీసులచే సెంటర్లు నడిపించే యోచనలో ప్రభుత్వము ఉన్నట్లు తెలిసింది.

## అడ్మిషన్ కోసం
# దరఖాస్తు చేసుకోండి

**– జిల్లా కలెక్టర్ జి.సృజన**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 2024–25 విద్యాసంత్సరానికి సంబంధించి 6, 9వతరగతుల్లో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు సంబంధించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 2024 జనవరి 21న ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ నెల 16వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.


జిల్లా కలెక్టర్ జి.సృజన

# అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపిన భూమా అఖిలప్రియ



అంగన్వాడీలతో కలిసి నిరసన తెలియజేస్తున్న భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ మెజార్టీ న్యూస్ :** తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధికంగా సమ్మెలోకి అంగన్వాడీలకు మాజీమంత్రి భూమా అఖిలప్రియ మద్దతు తెలిపారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో నిరసన దీక్ష చేపట్టిన అంగన్వాడి దీక్ష శిబిరాన్ని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సందర్శించారు. వారి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలు తమ డిమాండ్ల కోసం సమ్మె చేపట్టారని వారి డిమాండ్లు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనిఆమెడిమాండ్ చేశారు. వారు శాంతియుతంగా నిరసన చేస్తున్నారని కానీ ప్రభుత్వంవారి సమ్మెను అణచివేసే దిశగా ప్రయత్నం చేస్తుందన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించికనీస వేతనంఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. అంగన్వాడీలు తమ సమస్యల కోసం చేస్తున్న సమ్మెకు తెలుగుదేశం జనసేన తరపున మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. తెదేపా అధికారంలోకి ఉంటే అంగన్వాడీలు సమ్మె చేపట్టాల్సిన అవసరమే ఉండదన్నారు. వైసిపి ప్రభుత్వం అంగన్వాడి సెంటర్లను మహిళా పోలీసులు సహాయంతో సూపర్వైజర్ల తాళాలు పగలగొట్టి అంగన్వాడి సెంటర్లను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందని వారి ద్వారా అంగన్వాడి సెంటర్లను నడపడం సాధ్యమవుతుందా అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

# కొఠారి మిల్లు కార్మికులకు చెక్కులు అందజేత

- రూ.1 లక్షా 16వేల 500ల చొప్పున 80 మందికి అందజేసిన ఎమ్మెల్యే సాయి
- 772మంది కార్మిక కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేస్తాం
- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి



అనారోగ్యంతో ఉన్న కార్మికుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ఆదోని పట్టణంలో మూతపడిన కొఠారిమిల్లు కార్మికులకు, ఉద్యోగులకు స్థానిక ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం ఆయన పట్టణంలోని కౌడల్ పేటలో పర్యటించారు. అనారోగ్యంతో నడవలేనిస్థితిలో ఉన్న కొఠారిమిల్లు కార్మికుడైన వలి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. రూ. 1 లక్షా 16 వేల 500ల చెక్కును ఆయన వలికి అందజేశారు. అనంతరం రాత్రి ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే దాదాపు 80 మంది కొఠారిమిల్లు కార్మికులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో పేరుగాంచిన ఆదోని కొఠారిమిల్లు మూతపడటంతో గడిచిన కొన్నేళ్లుగా వందలాది మంది కార్మిక కుటుంబాలు అనేక కష్టాలు పడుతున్నారని గుర్తు చేశారు. గతంలో జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా చేసుకున్న ఒప్పందం ప్రకారం కార్మికుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈ రోజునుండి ఒక్కొక్కరికి రూ.1 లక్షా 16 వేల 500 లను దాదాపు 772 మంది కార్మికులకు చెక్కులను అందజేస్తామని వెల్లడించారు. చనిపోయిన కార్మికులకు వారి కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్, అఫిడవిట్, ఆధార్ కార్డు పత్రాలను త్వరగా సమర్పిస్తే వారికి కూడా చెక్కులను అందజేస్తామని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి సహకరించిన కొఠారి మిల్లు యాజమాన్యం నాగభూషణం కుమారుడైన గట్టు ఫణి అదేవిధంగా రాఘవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అడ్వకేట్ జీవన్ లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. వైసిపి ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉంది అని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతూ ఆశగా ఎదురుచూస్తున్న మిల్లు కార్మికుల కుటుంబాలకు ఎట్టకేలకు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చెక్కులను పంపిణీ చేయడంతో కొఠారి మిల్లు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి, మిల్లు యాజమాన్యం ఫణి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపిన జనసేన

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న వారికి నియోజకవర్గం ఇంచార్జి రేఖ గౌడ్ ఆదేశాలతో జనసేన పార్టీ సంఘీభావం తెలిపారు. జనసేన నాయకులు కరణం రవి, రాహుల్ సాగర్‌లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటి ఇవ్వాలని, గత ఆరు నెలల నుండి పెండింగ్లో పెట్టిన సెంటర్ అద్దెలు, టిఏ బిల్లులు తక్షణం చెల్లించాలని,ఆయాల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచి, రాజకీయ జోక్యాన్ని నివారించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ప్రమోషన్లు కల్పించాలని, ఫేస్ రికగ్నైజేషన్ యాప్ రద్దు చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బీమా అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు చెల్లించి, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్న ఏ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం. చర్చల పేరుతో కాలయాపన తప్ప సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, నిధి



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న జనసేన నాయకులు

లేని పరిస్థితుల్లో అంగన్వాడి కార్మికులు నిర్వాహిక సమ్మెలోకి వెళ్లడం జరిగిందని తెలిపారు. నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అందరికీ బటన్ నొక్కడం తప్ప అంగన్వాడీలకు చేసింది గుండు సున్నా అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షబ్బీర్, వినయ్, మల్లికార్జున, మురళి, ఎల్లప్ప, శ్యామ్, పరశురాం, వెంకటేష్, పవర్ స్టార్ రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల నిరసనలకు మద్దతు పలికిన మాజీ ఎంఎల్ఏ కోట్ల సుజాతమ్మ..




అంగన్ వాడీలతో కలిసి దీక్ష చేపట్టిన మాజీ ఎంఎల్ఏ కోట్ల సుజాతమ్మ

**ఆలూరు,మేజర్ న్యూస్:** అంగన్ వాడి సమస్యలను తీర్చాలని గత నాలుగు రోజులుగా ఆలూరు పట్టణంలో పాత బస్టాండ్ ఆవరణంలో చేపట్టిన అంగన్‌వాడీల నిరసనల దీక్షలకు ఆలూరు టిడిపి ఇంచార్జి మాజీ ఎంఎల్ఏ కోట్ల సుజాతమ్మ మద్దతు పలికారు. శుక్రవారం ఆలూరులో అంగన్‌వాడి వర్కర్లు,ఆయాలు చేపట్టిన నిరసన దీక్షలకు తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు పలికారు. ఈసందర్భంగా కోట్ల సుజాతమ్మ అంగన్‌వాడీలతో కలిసి నిరసన చేపట్టారు. గతంలో చంద్రబాబు 4 వేల వేతనాన్ని 9 వేలుగా చేస్తే టిడిపిని కాదని వైసిపి మద్దతు పలికారని ఇప్పుడు జగన్ అంగన్ వాడీలకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకపోగా వారి వేతనాలు పెంచుతానని మాట ఇచ్చి తప్పారని మూసిన అంగన్ వాడి సెంటర్లను బలవంతంగా రెవెన్యూ,పోలీసు అధికారులచే తాళాలు పగలగొట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీలు,ఆశా వర్కర్లు జగన్‌కు వీడ్కోలు పలకాలని వారు సూచించారు. అంగన్‌వాడీ వర్కర్లకు వేలిముద్ర,ఫేస్ యాప్ ఇలా పలు రకాల యాప్‌లు ఇచ్చారని వాటిని చేయడానికి సమయం సరిపోతుందని కావున అంగన్‌వాడీలకు ఇచ్చిన యాప్‌లను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్లు,ఆయాలు, సిఐటియులు నాయకులు నారాయణ స్వామి,కృష్ణ, మైనాలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి ఏపీటీఎఫ్ తీవ్ర సంతాపం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో జరిగిన అకాల మృతికి ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు జి.హృదయరాజు, నగిరి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.మాధవ స్వామి, కె.సాంబశివుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ విద్యారంగ,ఉపాధ్యాయ రంగ ప్రయోజనాల కోసమే కాకుండా అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం అనేక పోరాటాలు చేసిన చురుకైన ఉద్యమ కారుడు అని వారిలేని లోటు ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని ఏపీటీఎఫ్ తమ సంతాప ప్రకటనలో వెల్లడించింది.

# గొర్రెల పెంపకం సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



**పాములపాడు,మేజర్‌న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో శ్రీ చెన్న కేశవస్వామి ప్రాథమిక గొర్రెల పెంపకం సలహాదారుల సంఘం ఎన్నికను పశు వైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘానికి అధ్యక్షునిగా వై చిన్నన్న సెక్రటరీగా వెంకటరమణ కార్యవర్గ సభ్యులుగా ఈశ్వరయ్య శ్రీరాములు తిక్క స్వామి శ్రీనివాసులు పుల్లన్న లను సంఘం సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు చిన్నన్నకు పశు వైద్యాధికారి డాక్టర్ డిక్లరేషన్ పత్రాన్ని అందించారు.

# టిడిపి అధికారంలోకి రావడం ఖాయం

**చాగలమరి ,మేజర్ న్యూస్ :** 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష అన్నారు. శుక్రవారం ఆయన కొట్టగడ్డ కాలనీలోని 226 వ బూతులో బాబు షూరిటీభవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆయన టిడిపి మినీ ఫాస్టో లోని అంశాలను ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి ప్రయోజనం చేకూరేలా మేనిఫెస్టో తయారు చేసామన్నారు. యువతకు ఉపాధి, అన్ని పేద వర్గాలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. నవరత్న పథకాలు అందరికీ అందలేదని కొందరికి మాత్రమే లబ్ధి చేకూరింది అన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజల మద్దతు కావాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ముల్లా షాబులు, క్లస్టర్ ఇంచార్జ్ ఉన్ ముల్లా అజీమ్, ప్రచార కార్యదర్శి ముల్లా గఫర్, టిడిపి నాయకులు జహీర్ మహమ్మద్ రఫీ జయరాముడు పకీర్ భాష బాషా వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను అందజేస్తున్న ఎంఎస్ అన్సర్ భాష

## అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** వెల్దుర్తి పట్టణానికి అతి సమీపంలోని 44వ జాతీయ రహదారి పై నూతనంగా నిర్మించబడుతున్న 51అడుగుల అభయ ఆంజనేయు స్వామి విగ్రహ స్థాపన మరియు దేవాలయ నిర్మాణంనకు ఇంజనీరింగ్ విద్యా సంస్థల అధినేత, రెడ్ క్రాస్ సంస్థ డైరెక్టర్, డా.సుబ్బారెడ్డి లక్ష రూపాయలు విరాళాన్ని శుక్రవారం దేవాలయ నిర్వహకుడు గురు స్వామి రామాంజనేయులుకు చెక్కు రూపంగా లక్ష రూపాయలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డా.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ధర్మ పరిరక్షణకు, ప్రజలకు మంచి జరిగే అన్ని కార్యక్రమలకు తన సహాయం, ప్రొచ్ఛహం ఉంటుందని, ప్రజలందరూ భక్తి భావం మరియు సత్ప్రవర్తన తో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా ట్రెజరర్ జులకంటి రఘునాథ్ రెడ్డి, సమక్షంలో లక్ష రూపాయల చెక్ అందచేశారు.

# 17న జిల్లా క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ఈ నెల 17న కర్నూలు జిల్లా బిక్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీల నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి కొత్తపల్లి సుబ్బరత్నాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో స్త్రీలు, పురుషులు, బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు 24వతేదీన సామర్లకోటలో జరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8989409232, 9493323964 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది , మహిళ పోలీసులకు అప్పగింత



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి టీచర్లు, ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గత నాలుగు రోజుల నుండి చేస్తున్న సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని మూతపడిన అన్ని అంగన్వాడి కేంద్రాలను వెంటనే తెరవాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లుకు ఆదేశాలు ఇవ్వడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తాసిల్దార్ శివ రాముడు ఎంపీడీవో శ్రీనివాసరావు మరియు సిబ్బంది అంగన్వాడి కేంద్రాల దగ్గరకు వెళ్లి తాళాలు వేసిన అంగన్వాడి సెంటర్లను గుణపంతో పగులగొట్టి అంగన్వాడి సెంటర్లను తెరిచారు. ఈ అంగన్వాడి కేంద్రాలను సచివాలయల సిబ్బంది మరియు మహిళ పోలీసులకు అప్పచెప్పినట్లు తాసిల్దార్ శివరాముడు తెలిపారు.

సూర్య



### ట్యాబులు ఇవ్వడం వల్లనే

# హైస్కూల్ పిల్లలు చెడిపోతున్నారా..?

- ఇది టెక్నాలజీ ప్రపంచం.. ఎమ్మెల్యేలు, ఎంపీలే పోర్న్ వీడియోలు చూస్తుంటారు
- పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు దక్కకూడదనే ట్యాబులపై దుష్ప్రచారం
- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వ్యాఖ్యలు
- కార్పొరేట్ విద్యార్థులు కూడా ప్రభుత్వ బడుల్లో వస్తున్నారు
- విద్యాభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** హైస్కూల్ పిల్లలు ఎవరో ఒకరిద్దరు గేమ్స్ ఆడారని, పోర్న్ చూశారని రాష్ట్రంలో ఒకటి రెండుచోట్లా ఫిర్యాదులు వచ్చాయి. ఆ మాటకు వస్తే ఎమ్మెల్యేలు, ఎంపీలే పోర్న్ వీడియోలు చూస్తుంటారు. అయితే ఇది టెక్నాలజీ ప్రపంచం. ఈ టెక్నాలజీని ఉపయోగించుకుని ఎంతోమంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు చదువులలో ఎంతగానో రాణిస్తున్నారని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం అయన నివాసంలో విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోర్న్ బొమ్మలు పిల్లలే కాకుండా, పెద్ద పెద్ద నగరాల్లో చదివే విద్యార్థులు, ఎమ్మెల్యేలు కూడా చూస్తారని వాళ్లందరికీ లేని అభ్యంతరం మీకెందుకని ప్రశ్నించారు. ఎక్కడో ఒకచోట జరిగిన దానిని రాష్ట్ర మొత్తం చెడిపోతుందని తప్పుడు రాతలు రాయడం దుర్మార్గపు చర్య అన్నారు. పిల్లలకు కంప్యూటర్లు ల్యాప్టాప్ లు ఇవ్వ కూడదనడం మంచి పద్ధతి కాదన్నారు.



మాట్లాడుతున్న చెన్నకేశవరెడ్డి

విద్యార్థుల భవిష్యత్తు కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి దేశ ప్రదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉండడానికి లాప్టాప్ లు, కంప్యూటర్లను అందించారని, విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయనపై బురద జల్లడం వంటి చర్యలకు పెత్తందారులు పాల్పడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థులు చదువు కోసం సీఎం జగన్ అన్ని విధాల సౌకర్యాలు కల్పించారని, కార్పొరేట్ బడుల్లో చదివే విద్యార్థులు కూడా ప్రభుత్వ బడుల్లో వస్తున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థులు ఎటువంటి పరిస్థితుల్లో ఇంగ్లీష్ మీడియం చదువుకూడదని ఉద్దేశం వాళ్లకు ఉందని, రామోజీరావు, పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు పిల్లలు పెద్ద పెద్ద కార్పొరేట్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం చదువు కోవచ్చా అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇదంతా పెత్తందారులు చేస్తున్న కుట్ర అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు ఎంతో మంచి మనసుతో స్వీకరిస్తున్నారని, వైసీపీ ప్రభుత్వంలో 90 శాతం మంది విద్యార్థులు స్కూళ్లకు పోతున్నారని, అమ్మ ఒడి పథకం ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. టెక్నాలజీతో సమాజాన్ని ముందుకు తీసుకు వెళ్తున్న వారిని అడ్డంకులు సృష్టించిన వ్యక్తులను ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

# పేద పిల్లలకు మంచిచేస్తే కేసులా..!

- ఎల్లో మీడియాలో వక్రీకరణ కథనాలు
- చంద్రబాబు మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- కోడుమూరు ఎమ్మెల్యే జె.సుధాకర్

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో పేద విద్యార్థులకు మంచి చేయాలనే సంకల్పంతో బైజూస్‌తో ఒప్పందం చేసుకుని పేద విద్యార్థులతో ట్యాబులతో విద్యనందిస్తున్న ముఖ్యమంత్రిపై ఎల్లో మీడియాల్లో అసత్య కథనాలు రాస్తున్నారని, టిడిపి నాయకులు తప్పడు ప్రచారం చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే జె.సుధాకర్ విమర్శించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కోవిడ్ సమయంలో ధనవంతుల పిల్లలు కంప్యూటర్లు, సెల్‌ఫోన్ల ద్వారా విద్యనభ్యసిస్తుంటే పేదలు వెనుకబడి విద్యకు దూరమవుతారనే ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులతకు ట్యాబులు పంచి బైజూస్ ద్వారా పాఠాలు నేర్పేలా ఒప్పందం చేసుకుంటే దానినిపై ఈనాడు పత్రికలో విద్యార్థులు తప్పదోవ పడుతున్నారని అ సత్య ప్రచారం చేస్తుందన్నారు. వీరి ఉద్దేశంలో పేద విద్యార్థులకు మంచి జరగదని కోరుకుంటున్నట్లు ఉందన్నారు. దీనికి తోడు టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జె.సుధాకర్

మరింత దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పేద ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులు ఎదగడం టిడిపి నాయకులకు మింగుడు పడటం లేదన్నారు. చంద్రబాబు నాయుడు కేవలం ధనవంతులకే కొమ్ము కాస్తున్నారని, పేదలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికలు పేదల తరుపున తమ పార్టీ, ధనవంతుల తరుపున టిడిపి బరిలో నిలుస్తుందన్నారు. టిడిపిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని.. భవిష్యత్‌లో టిడిపి నామ రూపం లేకుండా పోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సమావేశంలో కర్నూలు, గూడూరు జడ్పిటిసిలు ప్రసన్నకుమార్, కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎస్.మహబూబ్‌బాష, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ఈక్రాప్ బుకింగ్ చేసిన రైతులకు బీమా సౌకర్యం కల్పించాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతాంగం పూర్తిగా దెబ్బతిందని ఆదుకొనేందుకు ఈక్రాప్ బుకింగ్ చేసిన రైతులకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ వంగాల భరత్ మాట్లాడుతూ వర్షపాతం వల్ల పంట నష్టపోయిన రైతులకు పంట బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఐదు సంవత్సరాల నుంచి ఏర్పాటు చేయకుండా రైతులతో డిపాజిట్ చెల్లించుకుని ఎందుకు మభ్యపెడుతున్నారని మానవతా దృక్పథంతో రైతులకు కనెక్షన్లు ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పాపిరెడ్డి మాట్లాడుతూ కరువు మండలాలకు, పంట బీమా పథకంనకు





సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్, సలహా మండలి చైర్మన్ భరత్‌కుమార్, పాపిరెడ్డిలు

ఎలాంటి సంబంధం లేదని ప్రతి మండలంలో వాతావరణ, పంట దిగుబడి ఆధారంగా పంట బీమా ఖరీఫ్ సీజన్‌లో విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర అంశాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట నష్టం జరిగిన రైతులకు మండల వ్యవసాయ అధికారులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ అధికారులు పంటలకు కల్పించే బీమా సౌకర్యంలో వాతావరణం, పంటల దిగుబడి ఆధారంగా వివిధ పంటలకు జిల్లా, మండలం, గ్రామం ఆధారంగా తీసుకుని పంటల బీమా వర్తింప చేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు వివరించారు. వర్షాధారం పంటల సాగు వివరాలు, భూగర్భ జలాల, శాటిలైట్ వివరాల ఆధారంగా ప్రభుత్వం పాణ్యం, బనగానపల్లె, మిడుతూరు, పగిడ్యాల, గడివేముల, బేతంచెర్ల మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించిన ఆరు మండలాలే కాక, క్రాప్ కటింగ్ ద్వారా తక్కువ దిగుబడి ఉన్న పంటలకు ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం ఉందన్నారు.

## ముగ్గురు ఎస్ఐలు బదిలీ

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** నగరంలోని 4వ పట్టణ, తాలూకా, వీఆర్‌లో ఉన్న పెద్దయ్యనాయుడు, రామయ్య, లక్ష్మినారాయణ ఎస్ఐలను బదిలీ చేసినట్లు జిల్లా పోలీసు శాఖ అధికార వర్గాలు తెలిపాయి. 4వ పట్టణ ఎస్ఐ పెద్దయ్యనాయుడును ఆదోని టుటౌన్‌కు, తాలూకా ఎస్ఐ రామయ్యను ఆదోని త్రీటౌన్‌కు, వీఆర్‌లో ఉన్న లక్ష్మినారాయణను ఆదోని వన్‌టౌన్ ఎస్ఐగా బదిలీ చేసినట్లు ఉత్తర్వులు అందాయి. త్వరలో వీరు ఆయా పోలీసుస్టేషన్‌లలో రిపోర్టు చేసుకోవాల్సి ఉంది.

### నగరవాసులకు అందుబాటులోకి..

## తాడిపత్రి ధమ్ బిర్యాని

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** కర్నూలు పట్టణ ప్రజలకు మంచి నాణ్యత, అందుబాటు ధరలో తాడిపత్రి వారి ధమ్ బిర్యాని అందుబాటులోకి వచ్చిందని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎ.భార్గవతేజ పేర్కొన్నారు. శుక్రవారం లక్కీ 9 వారి తాడిపత్రి ధమ్ బిర్యానీ ఫ్యామిలీ హోటల్‌ను కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి వారు తమ



తాడిపత్రి ధమ్ బిర్యానీ హోట ల్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ భార్గవతేజ

హోటల్‌లో మంచి ఆరోగ్య కరమైన నామ్యైన ఆహారం అందించాలని.. వ్యాపారం మరింత పెంచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం హోటల్ ప్రొప్రైటర్ కె.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ హోట్‌లో సరసమైన ధరలతోనే నాణ్యమైన ఫుడ్ అందజేసి ప్రజల ఆదరాభిమానం పొందుతామన్నారు. చిట్టి ముత్యాలు, మటన్ ధమ్ బిర్యానీ తమ హోటల్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి కుమారులు ప్రణిత్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి కుటుంబ స భ్యులు పాల్గొన్నారు.

## ఏర్పాట్లను సిద్ధం చేయండి

### – జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ఈ నెల 16న కోడుమూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న వికసిత్ భరత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో కేంద్రమంత్రి దేవాన్షచౌహాన్ పాల్గొంటున్న నేపథ్యంలో ఏర్పాట్లను సిద్ధం చేయాలని సంబంధితాధికారులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాట్లపై జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వికసిత్ భరత్ సంకల్ప్‌యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ లైవ్ టెలికాస్ట్ నుంచి ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారన్నారు. అందుకు తగిన ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో హిమప్రభాకర్‌రాజు, జడ్పీ సీఈవో నారసరెడ్డి, కర్నూలు ఆర్డీవో హరిప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కర్నూలు అభివృద్ధి కోసం

# అందరూ కలిసి పని చేయాలి: టీజీ భరత్

### – వైసీపీని వీడి టీడీపీలో చేరిన సీనియర్ నాయకుడు దేవా

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** కర్నూలు అభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాల్సినఅవసరం ఉందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. నగరంలోని 48వవార్డుకు చెందిన సీనియర్ నేత దేవా, ఆయన సోదరుడు శ్యాంలు తమ బృందంతో కలిసి వైసీపీని వీడి శుక్రవారం మౌర్య ఇన్‌లో టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టీజీ భరత్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ వైసీపీలోకి వెళ్లిన ఏడాదిలోపే మళ్లీ తెలుగుదేశం పార్టీలోకి రావడం సంతోషకరమన్నారు. కొన్ని కారణాల వల్లపార్టీ నుంచి వెళ్లిపోయిన దేవా వాస్తవాలు తెలుసుకొని సొంత గూటికి రావడం మంచి పరిణామమనానరు. ఎలాంటి స్వప్రయోజనాలు ఆశించకుండా దేవా తమ దగ్గరకు వచ్చారన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీని అధికారంలోకి తెచ్చుకునేందుకు కష్టపడాలన్నారు. కర్నూలు అభివృద్ధి చెందాలంటే మంచి నాయకుడు కావాలన్నారు. అనంతరం దేవా మాట్లాడుతూ వైసీపీ వల్ల ప్రకలు నష్టం తప్ప లాభమేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీజీ భరత్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. పార్టీలో చేరిన వారిలో శ్రీను, లక్ష్మన్న, పెద్దశేషన్న, యుగంధర్, బీసనన, దేవరాజు, దీవన్న, క్రిష్ణ, ఆయుబ్‌బాష, నాగేంద్ర, సామ మహేష్, అజయ్, పాల్, ఆంజనయులు, రాముడు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివామూర్తి, నగర అధ్యక్షుడు నాగరాజుయాదవ్, టీడీపీ సీనియర్ నేత మన్సూర్‌అలీఖాన్, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు రాజ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న దృశ్యం